క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



శివాజీ కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: అనారోగ్యంతో బాధ పడుతున్న గొర్లి శివాజీకి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. మాకవరపాలెం మండలం, శెట్టిపాలేనికి చెందిన శివాజీ గత కొన్నాళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స కోసం చాలా వరకు అప్పులు చేయాల్సి వచ్చింది. దీంతో ఈ విషయాన్ని గ్రామ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు రిఫర్ చేశారు. చెక్కు అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

మాడుగుల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం కె.జె.పురం హైస్కూలు ఆవరణలో నిర్వహించనున్నట్లు సర్పంచ్ జామి రమణబాబు ఆదివారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు, దీర్ఘకాలిక రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. కె.జె.పురం, కింతలి పీహెచ్‌సీ వైద్యులు, ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొని రోగులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తారన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

మహిళా ఓటర్లే అధికం

మాకవరపాలెం: తాజాగా ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితా మేరకు మండలంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మండల వ్యాప్తంగా 31 పంచాయతీల పరిధిలో మొత్తం 45,252 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 23,151 మంది మహిళా ఓటర్లు, 22,098 మంది పురుష ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. 3,612 మందితో అత్యధిక ఓటర్లు మాకవరపాలెం పంచాయతీలో ఉన్నారు. వచ్చే నెల 9 వరకు జాబితాల్లో మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఉత్సాహంగా చిల్డ్రన్ క్లబ్



చిల్డ్రన్ క్లబ్‌లో కథలు చెప్తున్న లైబ్రేరియన్ దమయంతి

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్స్ క్లబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు మాస్ రీడింగ్‌లో భాగంగా సింహం రాజు తెలివి, కష్టజీవి గెలుపు కథలను లైబ్రేరియన్ దమయంతి వివరించారు. నీతి కథల ద్వారా జ్ఞానంతోపాటు, నైతిక విలువలు పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పిల్లలచే పజిల్ గేమ్ ఆడించారు. ప్రతి ఆదివారం నిర్వహించే చిల్డ్రన్స్ క్లబ్‌ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విద్యార్థులకు సూచించారు.

డ్రైనేజీ పనులకు భూమి పూజ



వంటర్లపాలెంలో డ్రైనేజీ పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరావు

మాడుగుల రూరల్: మండలంలోని వంటర్లపాలెంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు సర్పంచ్ అల్లాడ నాగేశ్వరరావు భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గ్రామస్తుల అభ్యర్థన మేరకు మౌలిక వసతుల కల్పనకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనుల్ని ప్రారంభించినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, ఎన్‌ఆర్ఈజీఎస్ వీఆర్పీ నాగేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలు కలిసి నడిస్తే

పార్టీ మరింత బలోపేతం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- చోడవరంలో కార్యకర్తలు, ముఖ్య నేతలతో సమావేశం



అడ్డూరులో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: పార్టీని మరింత బలోపేతం చేయడానికి గ్రామస్థాయిలో కార్యకర్తలంతా కలిసి పనిచేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సూచించారు. అడ్డూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ముఖ్య నేతల సమావేశం ఆదివారం జరిగింది. వర్గ విభేదాలకు తావులేకుండా ఐక్యమత్యంగా ఉంటూ, పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బూత్‌ల వారీగా కార్యకర్తలను ఏర్పాటు చేసి పార్టీని పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి నారాయణమూర్తి, పార్టీ జిల్లా ప్రతినిధి శరగడం చిమ్మినాయుడు, మాజీ జెడ్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ పాల్గొన్నారు.



చోడవరం వాకర్స్ క్లబ్‌లో చేతిబోరును ప్రారంభిస్తున్న ధర్మశ్రీ

వాకర్స్ క్లబ్‌లో చేతి బోరు

చోడవరం వాకర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసి చేతి బోరును ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. క్లబ్‌లో సౌకర్యాలకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, టీవీ రమణ, పీఎస్ఎన్ గుప్తా, రెహమాన్, నాగఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో వీధి పండగల సందడి



పూలు, నగలతో మాడుగుల మోదకొండమ్మకు అలంకరణ



అమ్మవారి దర్శనానికి ఘటాలను శిరస్సున పెట్టుకుని బారులు తీరిన భక్తులు

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం భారీ స్థాయిలో వీధి పండగలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వందలాది మంది అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను శిరసున పెట్టుకుని కాలినడకన ఆలయానికి చేరుకుని, మొక్కులు తీర్చుకున్నారు. వీధి పండగలతో పాటు అధిక సంఖ్యలో సాధారణ భక్తులు కూడా ఆలయానికి తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనానికి కిలో మీటరు మేర భక్తులు క్యూ లైన్లో నిరీక్షించారు. అమ్మవారి మండపంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. ఉచిత ప్రసాద వితరణ జరిపారు.

బస్సు యాత్ర విజయవంతానికి కృషి

మాడుగుల: వచ్చేనెల 2న నియోజకవర్గ స్థాయిలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి, మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమం మండలంలోని ఘాట్‌రోడ్డులో ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుందన్నారు. మండలంలోని 29 పంచాయతీల నుంచి అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, వలంటీర్లు, పీఏసీఎస్ అధ్యక్షులు, పాల కేంద్ర అధ్యక్షులు, డ్వాక్రా మహిళలు తరలిరావాల్సిందిగా కోరారు. వివిధ సామాజికవర్గాలకు సంబంధించి మంత్రులు హాజరై, ఆయా సామాజిక వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి

మాకవరపాలెం: ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. మండల కార్యవర్గ ఎన్నికను ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు డి.నూకరాజు అధ్యక్షతన నిర్వహించారు. మండల అధ్యక్షునిగా ఎస్.శ్రీరామ్మూర్తి, కార్యదర్శిగా మల్లేశలింగం, గౌరవ అధ్యక్షుడిగా జీఆర్ఎస్ఎన్ రాజు, ఉపాధ్యక్షులుగా రాజు, వరహాలబాబు, సంధ్యారాణి ఎన్నికయ్యారు.
జిల్లా కౌన్సిలర్లుగా పద్మ, లచ్చాపాత్రుడు, వెంకటలక్ష్మి, అశోక్‌సామ్రాట్, మల్లేశ్వరరావులు నియమితలయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

31న మినీ జాబ్‌మేళా

అనకాపల్లిటౌన్ : నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా నర్సీపట్నంలో ఎంఎల్ఎస్ కళాశాలలో ఈనెల 31న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి చాముండేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదువుకుని 18 నుంచి 25 సంవత్సరాలు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మర్ని వివరాలకు 7036363272 నంబరులో సంప్రదించాలని కోరారు.

జోరుగా డ్రైనేజీ నిర్మాణ పనులు



కొవ్వూరులో చేపడుతున్న డ్రైనేజీ పనులు

రోలుగుంట: మండలంలోని కొవ్వూరు గ్రామంలో జోరుగా డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గ్రామంలో ఇటీవల జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి డ్రైనేజీ సమస్యను స్థానికులు తీసుకెళ్లారు. సర్పంచ్ కాంతమ్మ కూడా ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని ధర్మశ్రీని కోరారు. దీనిపై స్పందించిన ఆయన రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను మండల పీఆర్ జేఈ ఉమామహేశ్వరుడు పర్యవేక్షించి, కాంట్రాక్టర్‌కు, కూలీలకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

వృక్షో రక్షతి రక్షితః



వృక్షాన్ని మరో చోట నాటేందుకు తీసుకెళ్తున్న దృశ్యం

అనకాపల్లిటౌన్ : అభివృద్ధి దిశగా అడుగులు వేస్తూనే పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోంది. సుంకరమెట్ట జంక్షన్ రహదారి విస్తరణ పనులకు అడ్డంకిగా మారిన 8 పెద్ద వృక్షాలను జేసీబీ సహాయంతో వేళ్లతో సహా తీసి, ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో మరలా నాటి, వాటి పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ముగిసిన ధర్మప్రచార వారోత్సవాలు



వారోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న కొణతాల మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్ : ధర్మప్రచార వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయని నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. అమ్మవారి ఆలయ ఆవరణలో వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22న ప్రారంభమైన వారోత్సవాలు వారం రోజుల పాటు నేత్రపర్వంగా జరిగాయని చెప్పారు. ఈ వారం రోజులు శ్రీ మరిడి మహాలక్ష్మి భజన బృందంచే బైబో భజన, అమృత వర్షిణి బృందంచే కోలాటం, శ్రీగౌరీలలితా ప్రార్థనా మండలిచే పారాయణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయన్నారు. వారోత్సవాలకు సహకరించిన పలు భక్తి బృందాలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, పలు బృందాల సభ్యులు పాల్గొన్నారు.

తమనారపాలెంలో నా మట్టి–నా దేశం



ఢిల్లీకి పంపేందుకు సిద్ధం చేసిన మట్టి కలశంతో బీజేపీ నాయకులు

రోలుగుంట: మండలంలోని రొంగలపాలెం పంచాయతీ శివారు తమనారపాలెం నుంచి నా మట్టి–నా దేశం కార్యక్రమాన్ని మండల బీజేపీ నాయకులు చేపట్టారు. దీనిలో భాగంగా ఆదివారం గ్రామంలో మట్టిని సేకరించారు. దీన్ని ఢిల్లీకి పంపించనున్నట్లు బీజేపీ నాయకులు తమరాన వెంకటరమణ, నాగలక్ష్మి, జ్యోతి, వేమవరపు సంతోష్ తెలిపారు.

విశ్వబ్రాహ్మణ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ సమావేశం



రామగణేశ్వరరావును సన్మానిస్తున్న యూనియన్ ప్రతినిధులు

నర్సీపట్నం: విశ్వబ్రాహ్మణ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం నర్సీపట్నం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ ద్వారా భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించుకున్నారు. యూనియన్ బలోపేతానికి కలసికట్టుగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని యూనియన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న కోటవురట్ల మండలం, పాములవాక పట్టాలమ్మతల్లి ఆలయం వద్ద వనసమారాధన ఏర్పాటు చేసేందుకు తీర్మానించామన్నారు. యూనియన్‌కు తగు సూచనలు, సహాలు ఇస్తూ ముందుకు నడిపిస్తున్న సంఘ సీనియర్ సభ్యుడు వెదురువాడ రామగణేశ్వరరావును యూనియన్ ప్రతినిధులు విశ్రాంత ఎంఈవో నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పీబీఎం మోహన్, సాంబశివరావు, కోశాధికారి ఆదినారాయణ శాలువా కప్పి, ఘనంగా సన్మానించారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గౌరీపరమేశ్వరులను పల్లకిలో ఊరేగిస్తున్న యువకులు

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో గౌరీపరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా విగ్రహాలను ఏర్పాటు చేసారు. ఎ.కోడూరు, ఎ.భీమవరం, గొండుపాలెం తదితర గ్రామాల్లో గల మండపాలు, ఆలయ ప్రాంగణాల్లో గౌరీపరమేశ్వరులను ప్రతిష్టించి, ప్రత్యేక పూజలను జరిపారు. ఏటా విజయదశమి పర్వదినం తర్వాత వచ్చే పౌర్ణమి నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను జరపడం ఆనవాయితీ. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు పంట పొలాల్లో నుంచి వరి దుబ్బుల్ని తీసుకొచ్చి, గౌరమ్మగా కొలుస్తారు. శనివారం గౌరమ్మను తలపై పెట్టుకుని ఊరంతా ఊరేగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజైన ఆదివారం గౌరీ నందీశ్వరులను పల్లకిలో ఉంచి ఊరంతా ఊగించారు. యువత ఉత్సాహంగా పల్లకిని మోశారు. ప్రతి ఇంటి ముంగిటా స్వామికి ఘనంగా హారతులిచ్చి, పూజలు చేశారు.

గ్రంథాలయంలో.. చదవడం మాకిష్టం



గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

గొలుగొండ: చదవడం మా కిష్టం కార్యక్రమాన్ని స్థానిక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి రాజుబాబు ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న విద్యార్థులు పాల్గొని, తమకు ఇష్టమైన పుస్తకాలను చేతపట్టారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ ప్రతీ ఆదివారం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యపై ఆసక్తి పెరగడంతోపాటు, గ్రంథాలయాల ప్రాధాన్యత విద్యార్థులకు తెలుస్తుందన్నారు.

ఆనాటి స్నేహం.. ఆనంద గీతం



పాఠశాల ఆవరణలో నాటి గురువులతో 2002–03 బ్యాచ్ విద్యార్థులు



అల్లూరి పార్కులో కృష్ణదేవిపేట హైస్కూల్ 1986 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు



జోగుంపేటలో తమకు చదువు చెప్పిన గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కె.కోటపాడు: దాదాపు రెండు దశాబ్దాల క్రితం వారంతా పదో తరగతి పూర్తి చేసుకున్నారు. అనంతరం కొందరు ఉన్నత చదువులు చదివి వివిధ హోదాల్లో స్థిరపడ్డారు. మరి కొందరు ఉన్న ఊళ్లలోనే వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఆదివారం వీరి ఆత్మీయ కలయికకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికయింది. 2002–03 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల పాఠశాల చదువులు పూర్తయి 20 ఏళ్లు గడుస్తుండడంతో మరోసారి కలుసుకునేందుకు నిర్ణయించారు. ఎక్కడెక్కడో ఉన్న తమ స్నేహితులందరినీ ఆహ్వానించారు. వీరి ఆత్మీయ సమావేశానికి అప్పుడు తాము చదువుకున్న హైస్కూల్‌నే వేదికగా మార్చుకున్నారు. సుమారు 120 మంది హాజరయ్యారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మైదానంలో తిరుగాడుతూ చిన్ననాటి తీపి గురుతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు స్వర్ణలత, ప్రసాద్, కుల్లయ్య, ఫణీంద్రలను ఆహ్వానించి, ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి, సాయంత్రం వరకు సరదాగా గడిపారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని తీర్మానించారు. పూర్వ విద్యార్థులు ఈర్లి చిన్ని, చింతు గణేష్, గొర్లి గోవింద, ధనాజీ, ఆకుల జగదీష్, కొయ్యి రాంబాబు, మద్దాల గోవింద్, చొప్పా శాంతి, మాధవి, రామలక్ష్మి, భారతి, జానకి తదితరులు పాల్గొని, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గొలుగొండ: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాలతో జోగుంపేట జిల్లా పరిషత్ హైస్కూల్, కృష్ణదేవిపేట జెడ్పీ హైస్కూల్ దరి అల్లూరి పార్కులో సందడి నెలకొంది. జోగుంపేటలో 1992 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు 80 మంది కలిసి సందడి చేశారు. కృష్ణదేవిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1986 టెన్త్ విద్యార్థులు కుటుంబ సభ్యులతోపాటు అల్లూరి పార్కులో సమావేశమయ్యారు. వీరంతా టెన్త్ పూర్తి చేసుకుని మూడు, మూడున్నర దశాబ్దాలు కావడంతో ఒకరినొకరు గుర్తుపట్టి, కుటుంబ సభ్యుల్ని పరిచయం చేసుకుని ఆనందంగా గడిపారు. జోగుంపేట స్కూల్లో తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. తాము చదివిన స్కూళ్లకు, కష్టాల్లో ఉన్న తమ మిత్రులకు సాయం చేయాలని తీర్మానించుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేసి, సాయంత్రం వరకు ఆనందంగా గడిపి, తిరుగుముఖంపట్టారు.

క్రీడాకారుల్ని ప్రోత్సహిస్తున్న సర్పంచ్‌కు సత్కారం



సర్పంచ్ అప్పారావును సత్కరిస్తున్న స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ శ్రీనివాసరావు, క్రీడాకారులు

చోడవరం: గ్రామీణ క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు గాంధీగ్రామం సర్పంచ్ గాడి అప్పారావు చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాష్ట్ర స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు అన్నారు. చోడవరం కాలేజీ గ్రౌండ్‌లో గ్రామీణ క్రీడాకారుల కోసం ఏర్పాటుచేసిన బాల్‌బాడ్మింటన్ కోర్టుల అభివృద్ధికి సర్పంచ్ అప్పారావు తన వంతు సహకారం అందించారు. దీనికి క్రీడాకారులంతా కృతజ్ఞతగా ఆదివారం ఆయన్ని సత్కరించారు. ఈ సందర్భంగా జొన్నాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో గత ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహించాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని విధాలుగా క్రీడలకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

లోసింగిలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి





కొత్త లోసింగి, పాత లోసింగిలో జ్వరపీడితులు

రోలుగుంట: మండలంలోని అర్ల గిరిజన పంచాయతీ శివారు కొత్త లోసింగి, పాత లోసింగిలో సుమారు 15 మంది జ్వరాల బారినపడి, మంచంపట్టారని, తక్షణమే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవింద, కేవీపీఎస్ మండల శాఖ అధ్యక్షుడు ఇ.చిరంజీవి కోరారు. ఆదివారం వీరు మీడియాతో మాట్లాడుతూ కొండ శిఖర గ్రామాలైన ఈ గ్రామాల్లో పీటీజీ కొందు తెగ ఆదివాసీలు నాలుగు రోజులు పైబడి జ్వరాలతో బాధపడుతున్నా వైద్యాధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం కమ్యూనిటీ హెల్త్ వర్కరు కూడా లేని ఈ గ్రామంలో తక్షణమే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, జ్వర పీడితులకు అవసరమైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

18న హలో మాదిగ.. చలో హైదరాబాద్



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న మంగరాజు

అనకాపల్లిటౌన్ : హలో మాదిగ.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నవంబర్ 18వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కట్టమూరి మంగరాజు తెలిపారు. గవరపాలెం అరుంధతీనగర్ సంఘం కార్యాలయంలో ఆదివారం చలో హైదరాబాద్ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్యకర్త చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరాలని ఆయన కోరారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సభకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా విచ్చేయచున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెట్ల నాయుడు, కొల్లి చిన్నఅప్పారావు, చేవ్వేటి అప్పారావు, పరదేశినాయుడు, ఈశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.